తెలుగు కళాసమితి న్యూజెర్సీ- రాజలక్ష్మీ ఫౌండేషన్ వారి కథల పోటీలో 2,000/-లు ద్వితీయ బహుమతి గెలుచుకున్న కథ.

-కొచ్చర్లకోట వెంకట సుబ్బారావు

ఆమె కళ్లు కొడి గట్టిన జ్యోతుల్లా ఉన్నాయి.

ఆమె ముఖం సుగంధ పరిమళాలు వెదజల్లి మహర్షి శాపం వల్ల వాడిపోయిన పారిజాత పుష్పంలా వుంది. పవిత్రతకు రూపమిచ్చినట్టు నుదుట ఎర్రని కుంకుమ బొట్టు.

ఆమె ముఖంపై ముడతలు అలల తాకిడికి యిసుకపై పరచబడ్డ చారికల్లా ఉన్నాయి. గంటో, ఘడియో అన్నట్లు గుండె గాలి తిత్తిలా కొట్టుకుంటోంది.

మండువా యింటి వసారాలో మెత్తలపై తెల్లని గుడ్డపరచి ఆమెను పరుండబెట్టారు. బంధువులు, చుట్టాలు గ్రామ అశేష ప్రజలు శోక సంతప్తులై 'దుర్వార్త' ఎప్పుడు వినాల్సి వస్తుందోనని భీతిచెంది ఉన్నారు.

ఆమె కళ్లు ఎవరి కోసమో వెతుకు తున్నాయి. చూపుల అర్థం తెలిసిన ఒక పుణ్యస్త్రీ "ఆయన్ని యిలా రమ్మనండి" అని కాస్త బిగ్గరగా అంది.

ఘోర తపస్సు చేసి భగవానుని ప్రత్యక్షం చేసుకుని చిన్న అలక్ష్యం వల్ల ప్రసన్నం చేసుకోలేకపోయిన మహర్షిలా ఉన్నాడు ఆయన. ఒకప్పుడు మంచి మోతుబరి రైతు. డాబు, దర్పం ఉన్న మనిషి. గ్రామంలో ఏ యింట్లో ఏ శుభకార్యమన్నా 'దేహీ' అంటే 'నాస్తి' అని ఎరుగడు. ఆయన వాక్కు దేవవాక్కు.

ఆయన వచ్చి ఆమెకు ఎదురుగా మునిగాళ్ల మీద కూర్చున్నాడు.

ఆమె వైపు నిశ్చలంగా చూస్తున్నాడు.

ఆమె పెదవులు చిరు గాలికి కదిలే చిగురు టాకుల్లా కొట్టుకున్నాయి.

"ఏ.....మం.....డీ !"హీన స్వరంతో అంది.

ఆయన కళ్లు చమర్చాయి.

"ఏమండీ! ఒక్కసారి నన్ను పేరు పెట్టి పిలవరూ!"

ఆయన కంటి వెంట రెండు కన్నీటి ముత్యాలు ఆమె నుదుటిపై రాలి కుంకుమ బొట్టును కాస్త చెరిపాయి. ఆమె పెదవులు వేగంగా కొట్టుకుంటున్నాయి.



ఆమె చుట్టూ వలయాకారంగా గుమిగూడి కూర్చున్న స్త్రీలు ఆమె వైపు ఆయన వైపు ఆశ్చర్యంగా మార్చి మార్చి చూస్తున్నారు.

"ఏమండీ! ఒక్కసారి నన్ను మనసారా పిలవండి. లేదూ కోపంగా తిట్టండి. మీ మాటలు వింటూ హాయిగా మీ ఒడిలో కన్ను మూస్తాను" ఆవేశంగా మెల్లగా అంది.

ఆయన ఏమీ మాట్లాడ లేదు. గుండె గొంతుకలో కొట్టాడు తోంది.

ఆమె మళ్లీ "ఏమండీ!" అని ప్రాధేయ పూర్వకంగా అంది.

"ఆయన మాట పడిపోయి యిన్ని సంవత్సరాలు అయితే యిప్పుడు మాట్లాడ మంటే ఎలా తల్లీ?" పుణ్యస్త్రీ అంది.

"ఏమండీ! వాళ్లు అంటున్నది నిజమా?" అని నిలదీస్తున్నట్లు న్నాయి ఆమె చూపులు.

ఆయన చూపులు గతమనే గుహలో ప్రవేశించాయి.

ఆ రోజు గదంతా సుందరంగా అలంకరించింది. సుగంధ పరిమళాలు మనసున మధురోహలు రేకెత్తిస్తున్నాయి. మల్లెల ఘుమ ఘుమలు మరులు గొల్పుతున్నాయి.

ఇదంతా యిరవై ఐదు వైవాహిక వసంతాలు పూర్తి చేసుకున్న తల్లిదండ్రులకు తనయులు చేసిన తతంగం.

"రామా! ఈ రోజు నువ్వెలా ఉన్నావో తెలుసా?" అంటూ ఆమెను తన కౌగిలి లోకి తీసుకోబోయాడు.

"యజమాని ముందు బానిసలా-కదూ!" అంది ఆమె.

ఆయన మనస్సు చివుక్కు మంది. ఒకింత లజ్జ పడి "రామా! నువ్వు నా అర్ధాంగివి. నా పంచ ప్రాణాలు నువ్వే".

ఆమె నిర్జీవంగా నవ్వింది.

"ఎంతకాలం నన్ను మభ్య పెడతారు? అర్ధాంగి అనే పదాన్ని అపవిత్రం చేశారు. ఎప్పుడూ నేను నేనుగా బ్రతక లేదు. అస్తిత్వం లేని దానిలా నీడలా జీవితం గడిపాను.

"మాతృత్వమనే బిగిపాశంలో బంధింపబడి యింతకాలం మీ దౌష్ట్యం సహించాను. ఇప్పుడు పిల్లలు పెద్దవాళ్లయ్యారు. ఎవరి కాపురాలు వాళ్లు చేసుకుంటున్నారు. తల్లిప్రేమ, పెంపకం వారికి అవసరం లేదు. పేగు తెంపుకుని పుట్టిన బిడ్డలే దూరమవగా లేనిది, బ్రతుకు బాటసారి దూరమయితే తట్టుకోలేనా?

ముందే ఈ మాట చెప్పచ్చు కదాని మీరు అనవచ్చు. మిమ్మల్ని ఎదిరిస్తే ఫలితమేమిటో నాకు తెలుసు. మీరు ఇల్లు పట్టించుకోక యిష్టారాజ్యంగా సంచరించేవారు. పిల్లలు వీధిన పడేవారు. దుర్మార్గుడో, సన్మార్గుడో 'తండ్రి' అనే వాడు బిడ్డలకు చాలా అవసరం. కుటుంబానికి ఒక పోలీసు యూనిఫాం లాంటివాడు. తల్లే సర్వస్వమైనా తండ్రి అజమాయిషీ పెట్టని కోటలా సంరక్షిస్తుంది. నా బిడ్డలకు 'తండ్రి' అనే పదం లోటు రాకూడదని ఇంత కాలం మీరు ఏమన్నా కిమ్మన లేదు. ఈ యింట్లో అంతా మీ పెత్తనమే చెల్లింది. నేను కట్టుకునే చీర దగ్గర్నుంచి వండే వంట వరకు అంతా మీ యిష్టాను సారమే జరిగింది. పిల్లలు చదువు కానీ, పెళ్లిళ్ల విషయంలో కానీ నన్ను సంప్రదించడం నామోషీ అనుకునేవారు. తెలివన్నది మీ ఒక్కరి సొత్తే అన్నట్లు విర్రవీగారు. నేనూ, పిల్లలు అనేకసార్లు మీ అహంకారానికి బలిపశువుల మయ్యాము. ఇక ముందు అలా సాగదు. మీ అహంకారం మీకు గొప్ప, నా ఆడతనం నాకు గొప్ప. ఇక నుంచి మనం భార్యాభర్తలంగా కాక స్త్రీ పురుషుల్లా వేర్వేరుగా బ్రతుకుదాం."

ఆయన అవాక్కయ్యాడు. తను అహంకారని తెలుసు

ఇంత కాలానికి ఈ ఎదురు దెబ్బ తగిలింది. అదీనూ అర్ధాంగి చేతుల్లో.

ఆయనకు ఏమి సమాధానం చెప్పాలో తెలియలేదు. క్షణాలు గడిచాయి. నిముషాలు, గంటలు దొర్లిపోయాయి. పందిరి మంచానికి కట్టిన మల్లెలు వాడిపోయాయి. అగరు వత్తులు నుసి అయ్యాయి. ఆయన నోటి వెంట ఒక్క పలుకు లేదు.

ఆమె కంగారు పడింది. భర్త తనని దూషిస్తాడని, కోపం పట్టలేక చెయ్యిచేసుకుంటాడని అనుకుంది. కానీ అందుకు విరుద్ధంగా ఆయన ఉలుకూ పలుకూ లేకుండా అలా ఉండిపోయాడు.

ఎంతటి వంచన. మనసులో విషం దాచుకుని యింతకాలం కల్లల కాపురం చేసింది. నా అహంకారం భరిస్తోందంటే భూదేవి అంతటి సహనశీలి అనుకున్నాను. కానీ పయో ముఖ విష కుంభం అని తెలుసుకోలేక పోయాను. ఇలాంటి స్త్రీతో కాపురం చేయటం కంటే శరీరం త్యజించటం మేలు అనుకున్నాను.

ప్రాణత్యాగం వల్ల ఆమె వియోగదుఃఖమే అనుభవిస్తుంది. కానీ అంతకంటే శిక్ష విధించాలి. ఏం చెయ్యాలి? ఆలోచనతో గంటలు దొర్లిపోయాయి. శిక్షవిధించేంత తప్పు ఆమెలో ఏమీ కనపడలేదు.

ఆలోచనతో ఆయన గుండె ఘనీభవించింది. గొంతు పూడుకు పోయింది. తదాదిగా ఆయన

ఆమెతోనే కాదు, ఈ లోకంతో పన్నెత్తి మాట్లాడి ఎరుగడు. అందరూ ఆయనకు మాట పడిపోయిందనుకున్నారు.

భర్త ఎన్నాళ్లకీ మాట్లాడక పోయేసరికి ఆ యిల్లాలు బెంబేలెత్తింది. "ఏమండీ! ఏదో తెలియని కోపంతో మిమ్మల్ని అనరాని మాటలు అన్నాను. మీరు వాటిని పట్టించుకోవద్దు. నన్ను క్షమించండి. మీరు మామూలుగా ఉండండి. తిట్టండి, కొట్టండి నేను అడ్డు చెప్పను", అంటూ ప్రాధేయ పడింది. అలా యిన్ని సంవత్సరాలుగా ప్రాధేయపడుతూనే ఉంది. కానీ ఆ యన అప్పటికీ ఎప్పటికీ మాట్లాడ లేదు.

"ఏమండీ! క్షమించానని ఒక్కమాట అనండి. శాంతిగా కళ్లుమూస్తాను" అని మళ్లీ యిపుడు అంటోంది.

ఘనీభవించిన ఆయన గుండెలో చిన్న కదలిక. ఇన్ని సంవత్సరాలు తనతో కలిసి కాపురం చేసిన సహధర్మచారిణి చివరి కోరిక

భార్యను, పిల్లల్ని తను ఎంతగా బాధ పెట్టాడు? తన అహంకారం భరించ లేక చివరకు మనస్సులో బాధ వెళ్లగక్కితే తను మరింత కఠినాత్ముడై ఆమెతో మాట్లాడ కుండా మౌనవ్రతం పట్టాడు. ఆ రకంగానూ ఆమె పై కక్ష సాధించాడు. తను మనిషి కాదు. మూర్తీభవించిన అహంకారం. పాషాణ హృదయుడు. అని ఆత్మ విమర్శ చేసుకుంటున్నాడు.

అహంకారపు తెరలు తొలగిపోయాయి. గర్వం మంచులా కరిగిపోయింది. ప్రేమ వెల్లువలా ఉప్పొంగింది.

'రామా!' అంటూ ఆమె శరీరంపై వాలిపోయాడు.

అందరూ నిశ్చేష్టులై చూస్తూ ఉండిపోయారు.

ఆమె ఆనందంగా కన్ను మూసింది.

'పుణ్యాత్ముడు. రామా అంటూ కన్నుమూశాడు' అని జనంలో ఎవరో చేతులు తిప్పతూ అన్నారు. ●

'శిక్ష' అన్న పదానికి కొత్త కోణం నుంచి విచిత్రార్థం చూపించిన ఓ గృహస్థు కథ ఇది! జీవితంలో ఈ తరహా గృహస్థులు ఎందరో!!